# గురితప్పింది

డియర్ పార్వతీ,

"నీకు తప్పించి ఇలాంటి ఉత్తరం ఇంకెవరికీ రాయలేను. పూర్తిగా చదువు.

ప్రొఫెసరు కృష్ణమూర్తికి అందమైన ముఖం ఉంది, సుసంపన్నమైన మేధ ఉంది. అయితే ఏం లాభం? కృష్ణమూర్తికి హృదయం లేదు. అక్కడ మెదడే ఉంది. మానవత్వం ఏ టార్చి వేసి చూసినా అతనిలో కనబడదు.

విదేశీ ప్రముఖులు వస్తే బ్రహ్మాండమైన పార్టీ ఏర్పాటు చేశారు కాలేజీవాళ్ళు. ఆ పార్టీలో మేం కలుసుకోవడం జరిగింది. ప్రిన్సిపాలుగారూ, వారి భార్యా చాలా సహృదయులు. కాని నన్నెందుకు ఆహ్వానించారో ఓ పట్టాన బోధపడలేదు. బహుశ, అటువంటి మేధావంతులకు తగిన ప్రేక్షకులుగా నా వంటి బుర్ర తక్కువ వాళ్ళుంటే గాని సంభాషణ రాణించదనుకున్నారేమో! తెలియలేదు.

అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఏదో విషయంలో నిధులవంటి వాళ్ళే. చాలామటుకు వారి సంభాషణ నా తల దాటి గాలిలో తేలిపోయిందనే చెప్పాలి. మొద్దుముఖం కన

బడనీయకుండా తెలివితేటలు ప్రదర్శిస్తూ అంతసేపు కూర్చోవడం - ఓర్పుకి పరీక్షే. ఓ గంటా, గంటన్నర గడిచేసరికి నా పరిస్థితి ఆవలింతల స్థితికి వచ్చింది. ఏం జరుగుతోందో తెలియకుండానే అంతా వెళ్ళిపోవడానికి సిద్ధపడుతున్నారు.

"బాగా ఆలస్యం అయిపోయింది. నిన్ను కృష్ణమూర్తి గారు కారులో దింపేస్తారు. వెళ్ళు ఉషా" అంటూ నా బాధ్యత ప్రొఫెసర్‌గారికి అంటగట్టారు ప్రిన్సిపాలు గారి భార్య.

కారులో కూర్చున్నానేగాని ఒక్క ఉలుకూ పలుకూ లేదు. రోడ్డుకి కళ్ళు, చక్రానికి చేతులు అప్పగించి కారు తోలుతున్నారు కృష్ణమూర్తిగారు. వారి ప్రక్కన కూర్చున్న నేను ఓ కర్ర దిమ్మనో, లేకుంటే ఇంకో శాస్త్రకారుడినో అయి ఉండవచ్చు.

పాపం! ప్రొఫెసరుగారు మాట్లాడారు.

కాని నేను వినీ వినని స్థితిలో ఉన్నాను. వస్తున్న ఆవలింతలు ఆపుకొంటూ రహస్యముగా వినీ వినబడనట్టు 'అంతే, ఆహా, అలగా, ఊ" అని అడపా తడపా సమాధానం చెపుతూ కూర్చున్నాను.

నన్ను ఇంటిదగ్గర దింపుతూ చాలా ఆప్యాయంగా "మళ్ళీ ఎప్పుడేనా ఇలాగే కలుసుకుందాం" అన్నారు కృష్ణమూర్తిగారు.

ఆ క్షణంలో గడ్డిపోచతో కొట్టివుంటే నేలకి ఒరిగి ఉందు ననుకో.

"ఇంత అందంగా ఉండి, ఇంత తెలివి తేటలుగల అమ్మాయిలు చాలా అరుదు. నీ పరిచయం కల్గినందుకు నా కెంతో సంతోషంగా ఉంది" అన్నారు.

నాకు ఊపిరి ఆడలేదు !

అదే ప్రారంభం అనుకో.

తరువాత రోజులూ, వారలూ తప్పిపోయాయి. దొర్లి పోయాయి. కాని ఈ మొదడుగారిని మనిషిగా మార్చాలనే నా ప్రయత్నాలు అంతంతమాత్రంగానే ము ం ద డు గు వేశాయి. తరుచుగా కలుసుకొంటూ ఉండేవాళ్ళం. కాలేజీ అయిపోయాక బీచికి వెళ్ళేవాళ్ళం. గ్రంథాలయాలు చుట్టే వాళ్ళం. ఉట్టినే అలా తిరిగివస్తూ ఉండేవాళ్లం.

కాని ఎంతకాలం అని ఇలా తెలిసీ తెలియని తెలివి తేటలు ప్రదర్శించగలను? ఎంతకాలం అలా శూన్యంలోకి చూస్తూ అదే నా తెలివి అని నమ్ముతున్న ఆ యన పక్కన కూర్చోవడం? ఇది లాభంలేదనిపించింది. నెలజీతం రాగానే పుస్తకాలుకొనడం ప్రారంభించాను. ఒకటేమిటి? సైన్సు, యస్ట్రానమీ, ఫిలాసఫీ. వాటితో కుస్తీపట్లు ప్రారంభించాను. నా పాత లెక్కల పుస్తకాలు పైకితీసి దులిపాను. నా ఆల్జీబ్రాకి మెరుగులు పెట్టడం ప్రారంభించాను.

మొదట్లో ఇదీ చాలా కష్టమైన పనే, ప్రాణం విసిగేది. అయితేనేం? తినగాతినగా వేము తీయనౌను అన్నారుకదా? ఇవన్నీ చదివి చదివి కృష్ణమూర్తిగారు అడిగినప్పుడు, అడగ నప్పుడు తెలివిగా ప్రశ్నలువేయడం నేర్చుకున్నాను. ఇలా ఒకటి రెండు తెలివైన ప్రశ్నలు వేస్తే చాలు, ఎంతసేపైనా

మాట్లాడకల రాయన! సైన్సులో ఎంత గట్టివారో ఇతర విషయాలలో అంత ఆసక్తి ఉంది ఆయనకి. నడిచే విజ్ఞాన సర్వస్వం అనుకో. గంటలకొద్దీ ఆయన చెప్పేది వింటూ ఉండేదాన్ని. వాటిమీందా వీటిమీందా తనథియరీలు చెప్పేస్తూ ఉండేవారాయన. ఒకొ్క్కప్పుడు ఆయన చెప్పేది అర్థం అయ్యేది. బుర్ర కెక్కేది. కాని తరుచు ఆయన అలా తీక్ష ణంగా మాట్లాడుతూంటే, పక్కవాటుగా ఆయన అందమైన ముఖంచూస్తూ "ఈ మానవుడూ, ఈ మెదడూ ఎప్పటికేనా మనిషి అవుతాడా? నన్ను దగ్గరికి తీసుకుంటాడా ?" అని ఆలోచించేదాన్ని.

ఒకసారి శాస్త్రీయ సంగీతకచ్చేరీనుంచి తిరిగివస్తూంటే నేను ఎన్నాళ్లనుంచో ఎదురుచూచినది జరిగింది. అప్రయ త్నంగా ప్రొఫెసరుగారి చేయి నా చేయిమీంద పడింది. అలాగే నా చేతిని గుప్పిట పట్టుకున్నారు. వింతగా నా ముఖం లోకి చూశారు. నా ఒళ్ళు పులకరించింది. నే కన్న కలలు నిజం అయాయి. హఠాత్తుగా ముందుకి వంగి నా చెంపమీంద ముద్దు పెట్టుకున్నారు. మరుక్షణంలో నే నా చేయి వదిలేస్తూ "క్షమించు ఉషా. నాకీ రోజు ఏమైంది?" అంటూ తెగ బాధపడ్డారు. "నీ లాంటి తెలివైనదానికి ఇలాంటివి అస హ్యంగా ఉంటాయి. నన్ను క్షమించు" అంటూ కారు స్టార్టు చేశారు. "నే నెందుకిలా చేశానో నాకే అర్థంకాలేదు, ఇకపై ఎప్పుడూ ఇలా జరగదు క్షమించు" అని పదే పదే క్షమా ర్పణలు వేడారు.

"మనిషిలా ప్రవర్తించినందుకు క్షమార్పణ అనవసరం మాష్టారూ" అన్నాను సాధ్యమైనంత చిలిపిగానే.

"చాలా సంతోషం. మామూలు స్త్రీలైతే నన్ను అపార్థం చేసుకునే వారు" అంటూ గోణిగారు కృష్ణమూర్తిగారు.

ఇది జరిగాక మా స్నేహం పూర్వంలాగే చాలా ఉన్నతంగా, ఆదర్శవంతంగా, మేధాసౌధాల ప్రాంగణాలలోనే నడిచింది. ఎక్కడా చెక్కుచెదరని ఈ మేష్టారిమీద నాకు కోపం వచ్చింది. జాలి వేసింది. అనాటి సంఘటనని పూర్తిగా మరిచిపోయాం,

ప్రొఫెసరుగారితో కలిసి అటూ ఇటూ తిరగని సమయంలో పుస్తకాలతో కుస్తీ పట్టేదాన్ని. కాలం జరగను నల్లరాళ్ళు సహితం కరిగినట్లు నా యీ పట్టుదలకి అతి క్లిష్టమైన గ్రంథాలు దాసోహం అన్నాయి. ఇదివరకులాగా మేష్టారు చెప్పినదానిని వినడంతోపాటు నా వ్యక్తిగత అభిప్రాయాలను సహితం చెప్పడం ప్రారంభించాను. ఇంకా పుస్తకాలు కొన్నాను...

ఉన్నట్టుండి, ఒకసారి ప్రొఫెసరుగారు రెండు వారాలు సెలవుపెట్టారు. తిరిగి రాగానే వివరాలు చెప్తాను అన్నారు. కొత్త థియరీమీద కూర్చుంటున్నారేమో అనుకున్నాను నేను.

వారాలు గడిచాయి. నేను ఇంకా ఇంకా పుస్తకాల పురుగులాగా తయారైనాను.

ఉన్నట్టుండి ఆ రాత్రి ఫోను వచ్చింది. నేను "న్యూక్లియోనిక్స్"తో (నీకు అర్థంకాదు లే!) కుస్తీపడుతున్నారు.

ప్రొఫెసరుగారు చాలా సరదాగా ఉన్నట్టున్నాను.

"నీకో విషయం చెప్పాలి" అన్నారు.

"చాలా హుషారైనదా?" అన్నాను.

"నువ్వు అలాగే అనుకోవాలని నా కోరిక. నిజానికీ ఊహ కల్గించినది నీవే మరి" అన్నారు.

"నేనా?" అని ఏమిటై ఉంటుంది చెప్మా. అని బుర్ర బద్దలు కొట్టుకున్నా ఏమీ తట్టలేదు.

"ఆదేం లేదు. నీకూ తెలియకుండానే నాలో ఊహాలు నువ్వు కల్గించావు. నీకు జ్ఞాపకం ఉందా ఆ రోజు? నీ చెంప మీద ముద్దు పెట్టుకున్నానే! ఆ రోజునుండే నా జీవితంలో ఉన్న లోటు ఏమిటన్నది గ్రహించాను" అన్నారు కృష్ణమూర్తిగారు హుషారుగా.

నా హృదయం ఉప్పొంగి పోతూంది. నా కంఠం పూడుకుపోతూంది, అయినా తేలికగా.

"రొమాంటిక్ ఎలిమెంట్?" అన్నాను.

"కరెక్టు! నీకు జ్ఞాపకం ఉందా? ఒక రోజు నా స్నేహితుని ఇంటిముందు కారుఆపి లోపలికి వెళ్ళి బెదురు గొడ్డులాగా తిరిగివచ్చాను!"

"జ్ఞాపకం లేకేం? అమ్మశక్తిలాంటి అమ్మాయి బూజుల కర్రతో హాలు మధ్య సాక్షాత్కరించింది అన్నారు!" నిజమే. నాకారోజు బాగా జ్ఞాపకం. కృష్ణమూర్తిగారు దడుసుకున్నంత

వస్తైంది, ముఖం ఎర్రబారింది. నుదుటపట్టిన చెమట జేబు రుమాలుతో తుడుచుకుంటూ హడావిడిగా వచ్చి కారులో కూర్చున్నారు.

"మేం పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం" సంతోషంతో తడబడింది మేష్టారికంఠం.

బాగుంది బాగుందికదూ? నే విన్నదేమిటో ఓ క్షణం తరవాత అర్థం అయింది. మేష్టారిని హృదయం ఉన్న మనిషిగా మార్చాలన్న నా తాపత్రయం బాగానే నెరవేరింది కదూ?

నాకూ మంచిపనే జరిగింది?

చివరికి నేనూ, పుస్తకాలూ మిగిలిపోయాం.

పరిస్థితులూ, మనులూ కూడా గమ్మత్తుగా చక్క-బడుతూ ఉంటాయి.

ప్రొఫెసరు కృష్ణమూర్తిగారు స్నేహితుని చెల్లెలిని లక్షణంగా వివాహం చేసుకున్నారు.

సంసార సాగరంలో తృప్తిగా, సుష్టుగా మునిగిపోయి ఆరు నెలలు కావస్తూంది. ఇంతే అనుకుంటున్నావేమో, అంతేకాదు. ఇంత ఆస్తిపాస్తులు, అందచందాలు ఉండి, ప్రేమించే పెళ్ళాం ఉండి ఎందుకొచ్చిన మేష్టరీ అనుకున్నారు కాబోలు-సైన్సుకి స్వస్తి చెప్పి మామగారితో వ్యాపారంలో భాగస్తులవాలని ఆలోచిస్తున్నారట. బాగుంది కదూ?

నేనేమైపోయానని అనుకుంటున్నావా? పుస్తకాలు చదివిచదివి నా మెదడుకి పదును ఎక్కింది. ఆలోచనలు క్యూరియాసిటీని పెంచాయి, యూనివర్సిటీలో రిసెర్చికి

వేశాను. ఇక్కడ సీటు రావడమే కాదు, స్టేట్సునుంచికూడా రిసెర్చికి ఛాన్సు వచ్చింది! ఓ పది రోజులలో వెళ్ళిపో తున్నాను. అక్కడ బహుశా ఏ ఫుట్ బాల్ ఆటగాణ్ణో పాప్ పాటగాణ్ణో ప్రేమించకుండా ఉండాలని దీవించు. మళ్లీ అక్కడినుంచే రాస్తాను.

నీ

ఉష"

చేతిలో ఉత్తరం పెట్టుకుని శూన్యంలోకి చూస్తూ నవ్వుకుంటూంది పార్వతి. అప్పుడే హడావిడిగా లోపలికి వచ్చిన కృష్ణమూర్తి కుర్చీలోంచి లేవతీసి పార్వతిని ఉత్త రంతో సహా కౌగిట చేర్చుకున్నాడు. "ఎవరు?" అని అడిగాడు.

"నా స్నేహితురాలు ఉత్తరం రాసింది" ఉత్తరం చదవమని అందిస్తూ కౌగిలి విడిపించుకుంది పార్వతి.

పార్వతి లేచిన కుర్చీలోనే కూలబడ్డాడు కృష్ణమూర్తి. యథాలాపంగా చదవడం ప్రారంభించిన ఉత్తరం కుర్చీలో ముందుకి వంగి తీక్షణంగా చదవసాగాడు. మైగాడ్! ఉత్తరం పూర్తిచేసి శూన్యంలోకి చూస్తూ పక్కన కాఫీ కప్పుతో నిలబడిన పార్వతి చీరకొంగుతో నుదుట పట్టిన చెమట తుడుచుకున్నాడు,

"కథలా ఉంది కదూ?" అన్నాడు కాఫీకప్పు అందు కుంటూ,

"ఎవరు!" అంది కొంటెగా పార్వతి.

"ఉత్తరం" అన్నాడు బెదురుగానే కృష్ణమూర్తి.

"కాదు, ఉమ" అంది పార్వతి.

"పోనిద్దూ, ఆ పుస్తకాల పురుగుసంగతి మనకెందుకు? ఇలారా" అంటూ పార్వతిని దగ్గరికి లాక్కున్నాడు.

"నేనూ సైన్సు చదువుతాను" అనబోయిన పార్వతి పెదవులు మూతవేశాడు-ఆవేశం వచ్చిన కృష్ణమూర్తి.